# శ్రీకృష్ణావతార లక్ష్యము

శ్లో// ద్వేష్యో పి సమ్మతః శిష్టః ఆర్తస్యేవ యథౌషధమ్
త్యాజ్యో దుష్టః ప్రియో పి స్యాత్ అంగుళీ వోరగక్షతా//



గుణవంతుడు శత్రువైనను రోగికి ఔషధమువలె గౌరవనీయుడు కావలెను - దుష్టుడు ఆప్తుడైనను సర్పదష్టమైన ప్రేలువలె సర్వథా త్యజింపదగినవాడు అని పై శ్లోకమునకు భావము.

ఈ పై సూక్తిలో మొదటి భాగమునకు విభీషణ శరణాగతి దృష్టాంతము రెండవ భాగమునకు పట్టు కొమ్మ కృష్ణావతారము - తత్ఫలమైన నరకాసుర వధము.

అధర్మ వక్షువు హిరణ్యాక్షుడు. అతడతి బలశాలి - మదోన్మత్తుడు - దురహంకారి. లోకములను చీకాకు పఱచుటయే అతని ధ్యేయము - ఆ ధ్యేయముతోనే అతడు మహీమండలమునెత్తి మహాజలధిలో ముంచి నాడు. భూదేవికి కాలు చేయి ఆడలేదు - ఊపిరంద లేదు - నిస్సహాయురాలై విలవిలలాడిపోయినది. ఆ తల్లితోపాటే సంతానమంతా తహతహలాడిపోయింది.

శ్లో// పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే!!

అని గదా! గీతాచార్యుని ప్రతిజ్ఞ. ఆ ప్రతిజ్ఞానుసారమే నీటిలో ఉక్కిరిబిక్కిరైపోతున్న ధరణీ సతి నుద్ధరించుటకు, హిరణ్యాక్షుని చంపుటకు శ్రీమన్నారాయణ మూర్తి ఆది వరాహమూర్తియైనాడు. ఆ మహోన్నతుని తోక గాలికి సముద్రములు ఘూర్ణిల్లినవి. ఆ మహో సూకర ఘుర్ఘురధ్వనికి దశదిశలు ఏక దిశగా మారి పోయినవి. ఆ భీకరమూర్తిని చూచి లోకభీకరుడు హిరణ్యాక్షుడే హడలిపోయి పాతాళమంటినాడు.

వరాహపతి, చక్రధారల వంటి పదునైన కోరలతో బంగారు కన్నుల వానిని క్రుమ్మి గుండె చీల్చి గాలిలో కలిపినాడు. దుష్టవధానంతరము భూసతిని భయము బాపి తన యక్కున నిలుపుకొన్నాడు వరాహ ప్రభువు. కమల మొదట కొంత కమిలిపోయినది కాని, తుదకు సమాధానపడినది. ఇద్దరాండ్రు కల భర్తలు లోకములో ఎందరు లేరు?

అనంతరము భూదేవి యొక కుమారుని కన్నది - అతడే నరకుడు. నరకాన్ని కూడా జయించినవాడు. అవతార ప్రయోజన సాధనానంతరము వరాహమూర్తి తిరిగి విష్ణుమూర్తియైనాడు. మహాత్ములు వృథాగా ఒక క్షణమైన కాలయాపనము చేయరు గదా!

నరకుడు బ్రతికి బట్టకట్టి నరకాసురుడైనాడు. అసాధ్య తపః ఫలముగా అనేక దివ్యశక్తులను సాధించి యజేయుడైనాడు.

నరకుని దుండగాలు హద్దుపద్దు లేకుండా పోయినాయి. అతడు జగత్తును మంగలంలో వేసి వేయించ ప్రారంభించాడు - అతని దుండగాన్ని ఓర్పుకు నామాంతరమైన భూదేవియే సహింపలేకపోయినది. భర్తతో కుమారునిపై నభియోగము చేసినది. బాధ్యత కల తల్లి అంతకంటే ఏమి చేస్తుంది? ఆలి మొర పెనిమిటి విన్నాడు. ధర్మాధర్మములను విచారించుకున్నాడు - దుష్ట శిక్షణకై కృష్ణుడై యవతరించినాడు. విశ్వంభరాసతి సత్యభామగా యవతరించినది.

నరకాసురుని ధాటికి సర్వలోకాలు గడగడలాడి పోయినవి. యజ్ఞయాగాదులు నామరూపాలు లేకుండా పోయినాయి. తిండి లేక దేవతలు పస్తులుంటున్నారు. దానికి తోడు నరకుడు కృష్ణుని తల్లియైన అదితి యొక్క కుండలాన్ని అపహరించాడు - నరకున కెదురులేదు. వాని దుండగానికి హద్దులు లేవు.

నరకుని ఉపేక్షిస్తే "ఆత్మావైపుత్ర నామాసి" అను శ్రుతి ప్రకారము దేశ రక్షణకై యవతరించిన తానే పరోక్షంగా దేశద్రోహి కాగలడు కృష్ణుడు.

కుమారుని ప్రాణానికి తన ప్రాణాన్ని అడ్డు వేస్తుంది మాతృదేవత. అటువంటి మాతృదేవతయే కుమారుని పాపాల్ని భరింపలేనని తనతో మొరపెట్టుకుంది. ఇవి యన్నియుగాక దుష్ట శిక్షణ తన ముఖ్య కర్తవ్యము. దాని ముందు సంబంధ బాంధవ్యములు తృణప్రాయములు. నరక వధ అవశ్యమైనది.

బిడ్డ తల్లిదండ్రుల కిద్దఱికి బిడ్డడే గదా! దుండగుడైన బిడ్డను తల్లి సమక్షములో ఆమె యనుమతితో దండించుట యుక్తమనియేమో కదనరంగమునకు సత్యభామను గూడ తీసికొని పోదలచినాడు కపట నాటక సూత్రధారి వసుదేవనందనుడు. నరకాసురుని నగరము చుట్టూ అగ్ని దుర్గములున్నవి - అపార జల దుర్గములున్నాయి. గిరి దుర్గము లున్నవి. శస్త్ర దుర్గములున్నవి. వాయు దుర్గములున్నవి. భూ మార్గమున ఆ నగరంలో ప్రవేశించుట యెంతవారికి అసాధ్యము - ఆ కిటుకు తెలిసికొన్న శ్రీ కృష్ణుడు సభార్యుడై, గరుడారూఢుడై ప్రాగ్జ్యోతిషపురములో ప్రవేశించినాడు.

గరుడారూఢుడై వచ్చిన భామాపతిని చూచి నరకుడు రుద్రుడైనాడు. అతని నోటి నుంచి అగ్ని చ్ఛటలవలె మంత్రములు ప్రజ్వరిల్లినవి. కరములందలి ఆయుధములు కార్చిచ్చులైనవి. అతని వికటాట్టహాసముతో భూమి హృదయము తల్లడిల్లినది. ఆకాశము ఆకార హీనమైనది.

నరకుడు కృష్ణుని ఎగాదిగా చూచినాడు - కృష్ణుని యవతారాంతర, పితృత్వము నరకుని మెదడుకు తట్టినదో, లేదో - తట్టినను అతని అజేయత్వము అభిమానము దాని కడ్డు పడినవేమో!

ఆ యాది దంపతులు నరకుని జూచినారు. వారి గుండె పొరలలో నెక్కడో వాత్సల్యము మెదలకపోలేదు - కాని దానిపై ధర్మాధికారము అధికారము చేసినది. ఆ యధికారము ముందు పుత్రవాసన తలవంచినది.

యుద్ధము ప్రారంభమైనది. నరకుడు పన్నిన వ్యూహముల కన్నింటికి శ్రీకృష్ణుడు విఱుగుడు వేసినాడు - ధర్మరక్షణము పుత్రప్రేమను జయించినది. నరకుడు చక్రానల జ్వాలలలో మాడి మసియైనాడు - అధర్మ మెంత బలవత్తరమైనా తుదకు నశింపక తప్పదు. చిత్రమేమిటంటే? కుమారుని వధలో తల్లి గూడా భాగము పంచుకొనుట - లోకహితము కొఱకై హితులను గూడా అహితులనుగా భావించుట మహాత్ముల సహజ లక్షణము.

నరకు డస్తమించినాడు - అతనిలో నుంచి యొక చిఱు దీప్తి యెగసి పరమాత్మలో లీనమైనది - ఆ ప్రవేశించుట నశ్వరమైన తనయు పాదిని వదలి జీవాత్మ పరమాత్మునిలో కలియుట. అదియే మన అద్వైత సిద్ధాంతము.

ఈ విధముగా శ్రీకృష్ణావతారము "తన వాడైనను దుష్టుని త్యజింపవలెను" అను పరమ ధర్మమునకు చక్కని దృష్టాంతమగుచున్నది — ఓం తత్ సత్

బూరుగల
గోపాలకృష్ణమూర్తి